**కథ** ప్రఫుల్లచంద్ర

# ప్రేమపరీక్ష

**పదో క్లాసు పిల్లలే ప్రేమించుకుంటున్న ఈ రోజుల్లో డిగ్రీ కాలేజీలో అడుగుపెట్టిన సౌజన్య ప్రేమలో పడడంలో ఆశ్చర్యం ఏముంది? ఆమె డిగ్రీ పాసయే వరకూ ఆ విషయం తల్లిదండ్రులకు తెలియకపోవటమూ ఆశ్చర్యం కాదు. గుట్టుగా సాగినంత కాలం సాగి క్లయిమాక్స్‌కు చేరిన తర్వాతనే పెద్దలకు తెలిసేది! తెలిసాక సహజంగానే ఇంటిలో వాదోపవాదాలు, హితోపదేశాలూ, రాద్ధాంతాలూ.**

గదిలో బంధించి తాళం వేయలేదు గానీ ఆమెను వెయ్యికళ్లతో కనిపెట్టుకుని ఉంటున్నారు తల్లిదండ్రులు. ఓరోజు హఠాత్తుగా పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చి వాసుతో పెళ్లి నిశ్చయించామని చెప్పాడు రాజారాం.

వాసు, రాజారాంకి స్వయానా మేనల్లుడు, సౌజన్యకు మేనమామ! పదో క్లాసు చదివి కాలేజీ రోడ్‌లో స్కూటర్లు రిపేర్ చేస్తూ వుంటాడు. అందంగానే వుంటాడు గానీ బట్టల నిండా ఆయిల్ మరకలతో.... తనకీ పెళ్లి వద్దని అరిచిందిగానీ వినేవారెవరు?

ప్రేమకు రెండు హృదయాలు సరిపోయినా పెళ్లికి నలుగురు పెద్దల అనుమతి కావాలి. అందుకే సౌజన్య తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోగా మేనమామ ఇంట పెరిగిన మోహన్‌కి సమస్యలేదు. అతగాడెప్పుడు ఇల్లు విడచిపోతాడా అని ఎదురుచూస్తున్న మేనమామ. వారి పెళ్లికి అభ్యంతరం చెప్పలేదు. ఎం.ఏ.పాసైన మోహన్ అడపాదడపా ఇంటర్వ్యూలకు వెళుతూ మిగిలిన సమయాల్లో కాలేజీగేటు వద్ద బీటు వేస్తూ సౌజన్యని ప్రేమించి ఇప్పుడు రాజమండ్రి ప్రయివేటు కాలేజీలో ఇంటర్వ్యూకి వెళ్లాడు.

ఫోనులో మాట్లాడితే తల్లిదండ్రులకు తెలిసిపోతుందని బాత్‌రూంలో సెల్ ద్వారా ఎప్పటికప్పుడు మోహన్‌కి మెసేజ్‌లు పంపుతూనే ఉంది సౌజన్య. 'మరేం ఫర్వాలేదు. నేను నిన్ను దక్కించుకుంటా. నాకుద్యోగం దొరికింది' అని రాజమండ్రి నుంచి మెసేజ్ పంపాడు మోహన్.

★ ★ ★

భయం భయంగా పెళ్లిపీటల మీద కూర్చుని మోహన్ రాక కోసం ఎదురుచూస్తోంది సౌజన్య. మంగళ వాద్యాలు మోగుతున్నాయి. ముహూర్తం సమీపిస్తున్న కొద్దీ సౌజన్యలో టెన్షన్ పెరిగిపోతోంది.

అంతలో- వాయువేగంతో దూసుకొచ్చిన ఓ కారు కీచుమని శబ్దం చేస్తూ కల్యాణమండపం ముందు ఆగడం, బిలబిలా ఆరుగురు యువకులు కిందకి దూకడం, మంత్రాలు చదువుతున్న పంతుల్ని ఇద్దరు ఈడ్చుకుపోవడం, మరో ఇద్దరు ఇనపరాడ్‌లతో అక్కడి వస్తువుల్ని ధ్వంసం చేయడం, మరో ఇద్దరు పెళ్లికూతుర్ని పీటల మీద నుంచి లేవదీసి కారు వద్దకు లాక్కుపోవడం, అందరూ ఎక్కి ఉడాయించడం- దిగ్భ్రాంతికర వేగంతో సినిమా ఫక్కీలో జరిగిపోయాయి.

ఆవేశంతో ఊడిపోతూ ''వాళ్లని చంపండి.. నరకండి...పోలీసులకు రిపోర్టు చేయండి'' అని అరిచారు కొందరు. అవమానం భరించలేక సౌజన్య తల్లి స్పృహ తప్పి కుప్పకూలింది. పోలీసు స్టేషన్‌కు వెళ్లబోతున్న రాజారాంని ఆపి సాంత్వన పరిచాడు వాసు.

★ ★ ★

గుడిలో పెళ్లిచేసుకుని ఆరు నెలలు స్వర్గంలో విహరించాక జీవిత సమస్యలు వేధించడం మొదలుపెట్టాయి సౌజన్యని. బంధువులకు దూరంగా ఉండడం మొదట్లో హాయిగా అనిపించినా ఇప్పుడు ఏదో వెలితిగా, అశాంతిగా వుంటోంది. తల్లిదండ్రులపైకి ధ్యాస మళ్లి ఎలా వున్నారో, తనని క్షమించారో లేదో అని బాధ పడుతోంది.

బంధువులు లేకపోవడం ఎంత బాధాకరమో కాన్పు సమయంలో బాగా అనుభవం అయిందామెకు. ఆస్పత్రి నుంచి బిడ్డతో ఇంటికి వచ్చేశాక మనవడు పుట్టాడని తెలియచేస్తే అమ్మానాన్నా సంతోషంతో రాజీపడతారని ఆమె ఆశించినా మోహన్ ఉత్తరం రాయలేదు. ఆమె వత్తిడి చేయలేదు.

రోజులూ నెలలూ సంవత్సరాలూ గడుస్తున్నకొద్దీ ఆమె హృదయంలో మహాశూన్యం వ్యాపిస్తోంది. వంట, తిండి, పడక లాంటి యాంత్రిక జీవనంతో జీవితం నిస్సారంగా అనిపిస్తోంది. విరక్తి కలుగుతోంది. ప్రేమ కళ్లద్దాలలో ఎంతో అద్భుతంగా కనిపించిన ప్రపంచం రంగువెలిసి పోయిన పెయింటింగ్‌లా కనిపిస్తోంది.

తన వివాహం సరిగా జరిగివుంటే సీమంతం, బారసాల, సంక్రాంతి పండుగ లాంటి వేడుకలన్నీ ఎంతో సంబరంగా జరిగేవి. ఆ వేడుకలు, సరదాలు తను కోల్పోయింది. ఆయన ముఖం తను, తన ముఖం ఆయన చూసుకోవడం ఒక్కటే మిగిలిన వేడుక!

కాలంతో బాటు మోహన్‌లో వచ్చిన మార్పు కూడా సౌజన్యను వేదనకు గురిచేస్తోంది. ఈమధ్య అతడు అందరితోనూ ''మాది ప్రేమ వివాహమండీ'' అని చెప్పుకోవడమే కాక పెద్దల్ని తన్నేసి పీటల మీద నుంచి ప్రేయసిని లాక్కుపోయి వివాహం చేసుకున్న వైనం కోతలు కలగలిపి డప్పుకొట్టుకుంటున్నాడు. అంతేకాదు, లెక్చరర్లతో బూతుకథలు, అందమైన అమ్మాయిలతో నర్మగర్భ సరస సంభాషణలు మొదలుపెట్టాడట. ''ప్రేమించండి. ప్రేమలేని జీవితం వ్యర్థం. పెద్దల్ని ఎదిరించి పెళ్లిచేసుకోండి-నాలాగ'' అని బోధిస్తున్నాడట.

జీవితంలో తగినన్ని విజయాలు సాధించలేనివారు ఆత్మన్యూనతతో ఇలా ప్రవర్తిస్తూ వుంటారని ఎక్కడో చదివిన సౌజన్య ఈ కొత్త సమస్యకు రాజీపడింది.

★ ★ ★

తీరి కూర్చుని ఎనిమిదేళ్ల వైవాహిక జీవితాన్ని నెమరువేసుకుంటే- ప్రేమ వివాహం, ఆరేళ్ల అబ్బాయి తప్ప తను సాధించినదేమీ లేదని అనిపించిందామెకు. వాసుని పెళ్లిచేసుకున్నా తన జీవితం ఇలాగే ఉండేదేమో. అయితే అప్పుడు తనకు తల్లిదండ్రుల అండదండలు, పండుగలూ, వేడుకలూ వుండేవి.

ప్రేమించి తప్పు చేశానా? అని అంతరాత్మ గుచ్చి గుచ్చి అడుగుతోందీ మధ్య.

పెళ్లిరోజున కొత్త బట్టలు ధరించి పండుగ చేసుకోవడం వారి అలవాటు. రేపే పెళ్లిరోజు. దీర్ఘంగా నిట్టూర్చి షాపుకి బయలుదేరింది సౌజన్య.

షాపు చాలా రద్దీగా వుంది. భర్తకి, బాబుకి రెడీమేడ్ దుస్తులు, తనకు చీర ప్యాక్ చేయించి బిల్లు చెల్లించడానికి వెళ్లి చూసుకుంటే భుజానికి వేలాడుతూ ఉండిన బ్యాగ్ మాయం! ఎవరు చేజిక్కించుకున్నారో..!

బిల్లు గుమాస్తా ఆమె వైపు ఎగాదిగా చూసి ఎగతాళిగా నవ్వి ''వెళ్లవమ్మా వెళ్లు'' అని కసిరాడు.

ఐదు వేలు పోయిన బాధకన్నా అతని ఎగతాళి ఆమెను మరింత బాధించింది. అవమాన భారంతో కన్నీళ్లు తిరిగాయి. అప్పుడే అక్కడికొచ్చిన మృదుల సాటి స్త్రీకి జరుగుతున్న అవమానాన్ని భరించలేక ''కస్టమర్‌ని గౌరవించలేని వాడివి నీకెవరిచ్చారయ్యా ఉద్యోగం! మేనేజర్‌ని రమ్మను. వెంటనే మెయిన్‌గేటు మూయించు. ఇప్పుడే పోలీసులను పిలుస్తున్నా'' గద్దిస్తూ తన బ్యాగ్‌లోంచి సెల్ తీసి నంబర్లు నొక్కింది.

ఆమె ఠీవి, దర్పం చూసి- ఇదేదో కొంప మునిగే వ్యవహారమే అని అతగాడు వణికిపోతోంటే మేనేజరు పరుగున వచ్చి విషయం తెలుసుకుని, గేటు మూయించి వెతకమని సిబ్బందిని ఆదేశించాడు.

రెండే నిమిషాల్లో ''అదిగో ఆ మూల పడి వుంది'' అంటూ ఒక సేల్స్‌మాన్ బ్యాగ్ తెచ్చి ఇచ్చాడు. విజయగర్వంతో చిరునవ్వు చిందించి సౌజన్య వైపు చూసింది మృదుల. దేవతలా రక్షించినందుకు కృతజ్ఞతలు చెప్పుకుంది సౌజన్య. తన కారులో ఆమెను ఇంటి వద్ద దించి మృదుల తన ఇంటిలో అడుగుపెట్టగానే ఫోన్ మోగుతోంది.

★ ★ ★

లెక్చరర్ మోహన్‌ని పోలీసులు అరెస్టు చేశారని తెలియగానే కాలేజీలో సంచలనం... అమ్మాయిలకు హర్షాతిరేకం.

మహిళా విభాగం అధ్యక్షురాలు అపర్ణ స్కూటర్ మీద మోహన్ ఇంటికెళ్లి సౌజన్యకు విషయం వివరించి ఆమెను కూడా తనతో పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లేటప్పటికే అక్కడ ఇన్‌స్పెక్టర్ ఎదుట కుర్చీల్లో మృదుల, ఆమె భర్త కూర్చుని వుండగా కడు దీనావస్థలో తల వంచుకుని నిలబడి వున్నాడు మోహన్!

గత కొంతకాలంగా అతడు అమ్మాయిల నంబర్లు సేకరించి ఫోనులో అసభ్యంగా మాట్లాడుతున్నాడట. బాధితులలో ఒకరైన మృదుల పోలీసులకు రిపోర్టు చేసి వారి సహకారంతో వల పన్ని ఈరోజు అతన్ని పట్టించింది.

భర్తని ఆ స్థితిలో చూసి షాక్ అయిన సౌజన్య- మృదుల ప్రక్కనే వున్న వాసుని చూసి స్థాణువే అయింది. అతడు కూడా ఆమెను చూసి ఆశ్చర్యపోయినట్టే కనిపించాడు. ఈలోగా అపర్ణ ముందుకొచ్చింది.

''ఇన్‌స్పెక్టర్‌గారూ! గురుస్థానంలో పూజనీయుడుగా వుండాల్సిన ఈయన గారు ఓరచూపులతో, సెక్స్ కబుర్లతో మమ్మల్ని వేధిస్తున్నాడు. ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చేస్తే ఆయనగారు చర్య తీసుకోవడం లేదు. ఫోను వేధింపు కేసులో దొరికాడు కాబట్టి ఈవ్‌టీజింగ్ కేసు కూడా పెట్టి గట్టిగా శిక్షించమని మా మహిళా విభాగం తరపున రిపోర్టు ఇస్తున్నా'' అంటూ కాగితం ఇచ్చింది.

కన్నీళ్లే తరువాయిగా వుంది మోహన్ పరిస్థితి.

ఎన్నో సాధించాలనుకుని ఏదీ సాధించలేని వాడే ఇలాంటి అల్లరి చిల్లరి పనులతో తనొక హీరో అయిపోయినట్లు భావించుకుని సంతృప్తి పడతాడు. అదొక మానసిక రుగ్మత. ఇప్పుడు పశ్చాత్తాపపడుతూ ఉండొచ్చు. కేసు పెడితే ఉద్యోగం ఊడి భార్యాబిడ్డలు రోడ్డున పడతారు. ప్రథమ తప్పిదంగా క్షమించి వదిలేయమని భార్యకు, అపర్ణకు నచ్చచెప్పి మళ్లీ అతగాడిలాంటి పనులు చేస్తే తనే స్వయంగా అరెస్టు చేయిస్తానని హామీ ఇచ్చాడు వాసు.




మోహన్‌తో సారీ చెప్పించుకుని ఫిర్యాదు ఉపసంహరించుకున్నారు మృదుల, అపర్ణ.

★ ★ ★

నేరస్తుల్లా తలలు వంచుకుని సౌజన్య, మోహన్‌లు సోఫాలో కూర్చోగా వాళ్లకి టీ ఇచ్చి లోనికి వెళ్లిపోయింది మృదుల.

వారి ఎదుటి సోఫాలో కూర్చుని-

''మిస్టర్ మోహన్! రౌడీయిజంతో పెళ్లిపీటల మీద నుంచి అమ్మాయిని లాక్కుపోయి పెళ్లిచేసుకోవడం సరైన పనే అని ఇప్పటికీ నమ్ముతున్నారా?'' సూటిగా అడిగాడు. సరైన పనే అని

అతని నమ్మకం. కానీ అప్పుడు తను అవమానించినా ఇప్పుడు తన రక్షకుడు వాసు. అందుకని ఏమీ అనలేకపోయాడు మోహన్.

''ప్రేమంటే త్యాగం, మానవత్వం కూడా. కానీ సౌజన్యా, నువ్వు మాత్రం ఎవరేలా చస్తే నాకేం అనుకుని పీటల మీద నుంచి లేచి వెళ్లి పెళ్లి చేసుకున్నావు. నీది ప్రేమా? స్వార్థమా? నాకిప్పటికీ అర్థం కావడం లేదు'' సౌజన్య వైపు చూస్తూ నిష్టూరంగా అన్నాడు వాసు.

ఇంటికి పిలిచి, టీ ఇచ్చి మరీ మాటలు మీరుతున్న వాసు మీద కోపం వచ్చింది సౌజన్యకు. కానీ అతడిప్పుడు ఆయిల్ మరకల పల్లెటూరి గబ్బిలం కాదు. విలాసవంతమైన ఇంటిలో మంచి హోదాలో వున్నట్టు దర్జాగా కనిపిస్తున్నాడు. సౌజన్య కోపం దిగమింగింది.

''నీది కచ్చితంగా స్వార్థమే అని నా భార్య అభిప్రాయం. అందుకే- ఐదేళ్ల నుంచి మేమూ రాజమండ్రిలోనే వుంటున్నా మీ ఇంటికి రాలేదు. మనం ఇలా కలుసుకోవటం కేవలం దైవఘటన. స్వార్థపరులకు సాయం చేయవలసిన అవసరం మాకు లేకపోయినా మానవత్వంతో నా భార్య నీకూ, నేను నీ భర్తకు సాయం చేసాం. స్వార్థప్రేమ కంటే మానవత్వం గొప్పదని మా ఉద్దేశం''

అతని ఒక్కొక్క మాటా సౌజన్య హృదయాన్ని ఛిన్నాభిన్నం చేయగా కుమిలిపోతూ ''కాదు కాదు మాది స్వార్థం కాదు. నిజమైన ప్రేమ'' రోదించింది ఆమె.

''అవును! కన్నతల్లి చనిపోయినా రాలేనంత గొప్పప్రేమ. ఆ దుఃఖంతో కన్నతండ్రి మంచం పట్టి హైబీపీతో పాక్షిక పక్షవాతం తెచ్చుకున్నా పరామర్శించడానికైనా రాకుండా ప్రేమసాగరంలో మునిగిపోయావు'' ఖంగుమంది అతని స్వరం.

షాక్ అయిన సౌజన్య ''అమ్మ చనిపోయిందా? నాన్నకి పక్షవాతమా? నాకు తెలియదు. నాకెవరూ చెప్పలేదు'' నెత్తి బాదుకుని విలపించింది.

''వాసు రాసిన ఉత్తరాలు అందాయి కానీ నిన్ను రప్పించి బంధించడానికి డ్రామా ఆడుతున్నారని భావించి నీకు చెప్పలేదు'' తలవంచుకుని అన్నాడు మోహన్.

భర్త మీద ఎన్నడూ లేని అసహ్యం పొంగుకురాగా ఉప్పెనలా అతని మీద విరుచుకుపడి భుజాలు పట్టి కుదిపేస్తూ, జుట్టుపీకి, షర్ట్ చింపేసి హిస్టీరికల్గా ఏడుస్తూ కూలబడింది సౌజన్య.

కాసేపు ఏడవనిచ్చి ఆమె స్థిమితపడ్డాక రమ్మన్నట్టు సైగ చేసి ప్రక్క గదిలోకి వెళ్లాడు వాసు.

గుమ్మంలో అడుగుపెట్టి ఆ దృశ్యం చూసి స్థాణువైపోయింది సౌజన్య.

ఎదురుగా కుర్చీలో నాన్న!

రేగిపోయిన పండుజుత్తు. కాంతి కోల్పోయిన కళ్లు. వెర్రిచూపులు. కుదురులేని శరీరం. మతిస్థిమితం లేనట్టు తెలుస్తూనే వుంది. ఆయన్ని బతిమాలుతూ, బుజ్జగిస్తూ అన్నం తినిపిస్తున్న మృదుల!

''నాన్నా!'' వెర్రిగా అరుస్తూ సుడిగాలిలా దూసుకెళ్లి ఆయన పాదాల వద్ద కూలిపోయింది సౌజన్య. ఆయన బెదిరిపోయాడు. వెర్రిచూపులు చూస్తూ ఎడమ కాలు కుర్చీ మీదకు లాక్కున్నాడు. కుడికాలు కదలలేదు. దానికి పక్షవాతం.

''నేను నాన్నా! నేను! నీ కూతుర్ని'' గుర్తు చేయడానికి ప్రయత్నించింది.

''నా కూతురు లేదు. అమ్మను చంపేసి పారిపోయింది. నన్ను ఇక్కడ... ఇక్కడ... తన్నేసి పారిపోయింది. నువ్వెవరూ?'' గుండె చూపిస్తూ సౌజన్య వైపు అనుమానంగా చూశాడాయన. ఆ స్వరం వెదురు బొంగులోంచి వస్తున్న గాలిలా బోలుగా అస్పష్టంగా వుంది. సౌజన్యకు అర్థం కాలేదు. మృదుల వివరించింది.

దుఃఖం ఉప్పొంగి కన్నీళ్లు తిరిగాయి సౌజన్యకు. ''నాన్నా! నాన్నా! నాన్నా!'' పలవరిస్తూ తల నేలకేసి బాదుకుంది.

మరింత బెదిరిపోయిన రాజారాం కుర్చీ లోంచి లేచి పారిపోబోయి, అది సాధ్యం కాక, కుర్చీతోబాటు కింద పడ్డాడు. ఆయన్ని లేవదీసి బయటకు వెళ్లమన్నట్టు సౌజన్యకు సైగ చేసింది మృదుల.

★ ★ ★

వాసు, సౌజన్యల పెళ్లికి వచ్చిన మృదుల ఆ పెళ్లి పెటాకులు కావడంతో జరిగిన రభసంతా కళ్లార చూసింది. కోపోద్రిక్తులై అందరూ అరుస్తోంటే సంయమనం కోల్పోని వాసు వ్యక్తిత్వం, మంచితనం ఆమెను ఆకర్షించాయి.

ఆమె ధనవంతుల బిడ్డ. ఎం.కాం. చదివి మేనేజ్‌మెంట్ కోర్స్ చేసి తండ్రికి వ్యాపారంలో సాయం చేస్తోంది. వాసుని పెళ్లిచేసుకుంటానని ఆమె చెప్పగా మొదట ఆశ్చర్యపోయినా ఆమె తీసుకునే నిర్ణయాల మీద నమ్మకం వున్న తల్లిదండ్రులు చివరకు సరే అన్నారు.

ఓపెన్ యూనివర్శిటీలో వాసు బికాం పాసై రాజమండ్రికి మకాం మార్చి క్రమక్రమంగా జిల్లాలోనే ప్రఖ్యాతి చెందిన ఆటోగారేజీతోపాటు కార్ల షోరూం యజమాని అయి రాజమండ్రి పురప్రముఖునిగా వెలిగిపోతున్నాడు. కాలక్షేపం కోసం మృదుల ఇంటిలోనే బ్యూటీ పార్లర్ ప్రారంభించింది. మతిస్థిమితం తప్పిన రాజారాంని వాళ్లే చూసుకుంటున్నారు.

★ ★ ★

వాసు తన కథ చెప్పడం ముగించగానే రాజారాంకి అన్నం తినిపించి అక్కడికొచ్చిన మృదుల-

''చూశావా, నీ ప్రేమ పర్యవసానం ఎంత భయంకరంగా వుందో'' అని కాసేపాగి ''మీది ప్రేమ వివాహం. మాది కాదు. అయినా ఏ విషయంలో మీరు మా కంటే మెరుగు? ధనంలోనా? విజయాలు సాధించడంలోనా? ఆత్మతృప్తిలోనా? ఆనందంలోనా?'' ప్రశ్నల వర్షం ఆపి నిదానంగా భర్త ప్రక్కన కూర్చుని తల వంచుకున్న సౌజన్య వైపు చూసింది మృదుల. ఆమె వద్ద సమాధానం లేదు.

''నేను ప్రేమ వివాహాలకు వ్యతిరేకం కాదు సౌజన్యా! కానీ చాలామంది ప్రేమ అనుకునేదాని వెనక- మా ప్రేమ, మా జీవితం, మా సుఖం- అన్న స్వార్థమే ఉంటోంది. స్వార్థపు పునాది మీద ప్రేమ నిలబడదు. అందుకే చాలా ప్రేమవివాహాలు విఫలం అవుతున్నాయి'' చెబుతూ చెబుతూ ఇంక చెప్పడానికేమీ లేనట్టు హఠాత్తుగా మౌనం వహించింది మృదుల.

సర్వశక్తులూ ఉడిగిపోయినట్టు నిస్త్రాణగా ఉండిపోయింది సౌజన్య. అంత నిస్త్రాణలోనూ మృదుల చెప్పింది నిజమే అని అంతరాత్మ ఘోషిస్తూనే వుంది. తను తల్లిదండ్రుల సమ్మతితోనే పెళ్లిచేసుకుని వుండాల్సింది. పెద్దల్ని ఒప్పించడమే ప్రేమ పెట్టే పరీక్ష. ఆ పరీక్షలో పాస్ అయితేనే ప్రేమ విజయం దక్కేది. పరీక్ష పాస్ అవకుండా అడ్డదారిలో పోతే దక్కేది ప్రేమ విజయం కాదు, ప్రేమ విషాదం!

